# 18, 19న నంద్యాలలో రాష్ట్రస్థాయి చెస్ పోటీలు--

## 11న జిల్లా జట్టు ఎంపిక పోటీలు--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 8:ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, నంద్యాల జిల్లా చెస్ సంఘం నిర్వహణలో ఈనెల 18, 19 తేదీల్లో నంద్యాల ఎస్బీఐ కాలనీలోని రామకృష్ణ పీజీ కళాశాలలో రాష్ట్రస్థాయి సీనియర్ చెస్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ పోటీల్లో పాల్గొనే నంద్యాల జిల్లా జట్టు ఎంపిక పోటీలు జూలై 11న రామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో జరుగుతాయని వెల్లడించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్రస్థాయి పోటీల కరపత్రాలను రామకృష్ణ విద్యాసంస్థల చైర్మన్, జిల్లా చెస్ సంఘం చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి విడుదల చేశారు.డాక్టర్ రామకృష్ణారెడ్డి, జిల్లా చెస్ సంఘం అధ్యక్షుడు డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీల విజేతలు జాతీయస్థాయిలో ఆంధ్రప్రదేశ్‌కు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. చెస్ క్రీడాకారులు ఏపీ చెస్ వెబ్‌సైట్ ద్వారా తమ పేర్లను నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 9010451585ను సంప్రదించాలని సూచించారు.కార్యక్రమంలో జిల్లా చెస్ సంఘం కార్యదర్శి రామసుబ్బారెడ్డి, లయన్స్ క్లబ్ ప్రతినిధులు సందీప్, మేడా చంద్రశేఖర్, సంయుక్త కార్యదర్శి రాజా చక్రవర్తి పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్‌లో నంద్యాల జిల్లా మరో ముందడుగు--

## 99.90 శాతం ఎన్యుమరేషన్ ఫారాలు పంపిణీ--

## 65.12 శాతం డిజిటైజేషన్ పూర్తి--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 8:ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని నంద్యాల జిల్లాలో వేగవంతంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జి. రాజకుమారి గణియా ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ దాదాపు పూర్తికాగా, డిజిటైజేషన్ ప్రక్రియ కూడా వేగంగా కొనసాగుతోందని పేర్కొన్నారు.జిల్లాలో మొత్తం 14,05,443 మంది ఓటర్లు ఉండగా, వారిలో 14,04,083 మందికి ఎన్యుమరేషన్



ఫారాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఇది 99.90 శాతం పూర్తయిందన్నారు. అలాగే ఇప్పటివరకు 9,15,156 ఫారాలు డిజిటైజేషన్ చేయగా, అది 65.12 శాతానికి చేరిందని వెల్లడించారు.అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా చూస్తే, ఆళ్లగడ్డలో 70.25 శాతం డిజిటైజేషన్‌తో జిల్లా వ్యాప్తంగా మొదటి స్థానంలో ఉండగా, శ్రీశైలం 68.83 శాతం, నందికొట్కూరు 66.06 శాతం, డోన్ 65.52 శాతం, బనగానపల్లె 61 శాతం, నంద్యాల 60.61 శాతం డిజిటైజేషన్ పూర్తిచేసినట్లు వివరించారు.మిగిలిన ఫారాలను కూడా త్వరితగతిన డిజిటైజేషన్ పూర్తి చేసి, ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని నిర్దేశిత గడువులో విజయవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ జి. రాజకుమారి గణియా ఆదేశించినట్లు తెలిపారు.

# ఎస్ఐఆర్ తనిఖీల్లో కమిషనర్ శేషన్న--

## పలు వార్డుల్లో విస్తృత పరిశీలన--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 8: ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలు చేయాలని మున్సిపల్ కమిషనర్ బి. శేషన్న అధికారులను ఆదేశించారు. బుధవారం పట్టణంలోని పలు వార్డుల్లో విస్తృతంగా పర్యటించి ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిని స్వయంగా పరిశీలించారు.దేవనగర్?శ్యామ్‌నగర్ పరిధిలోని 26వ వార్డులో ఎస్ఐఆర్‌పీఎస్ నంబర్లు 124 నుంచి 134 వరకు, సరస్వతి నగర్ 14వ వార్డులో 145 నుంచి 148 వరకు, ఎంఎస్ నగర్ 30వ వార్డులో 111 నుంచి 114 వరకు, వైఎస్సార్ నగర్ 38వ వార్డులో 26 నుంచి 31 వరకు, బొమ్మలసత్రం 32వ వార్డులో 128, 130, 200, 202, పొన్నాపురం 19వ వార్డులో 236 నుంచి 240 వరకు పరిశీలించి ఇంటింటా సర్వే, ఓటర్ల నమోదు, పత్రాల ధృవీకరణ పనులను క్షుణ్ణంగా తనిఖీ



చేశారు.ఓటరు జాబితా సవరణలో అర్హులెవరూ మిగిలిపోకుండా ప్రతి ఇంటిని తప్పనిసరిగా సందర్శించాలని, నమోదైన వివరాల్లో ఖచ్చితత్వం ఉండేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కమిషనర్ అధికారులకు ఆదేశించారు. సిబ్బంది సమన్వయంతో పనిచేసి నిర్ణీత గడువులో కార్యక్రమాన్ని పూర్తిచేయాలని సూచించారు.ఈ పరిశీలనలో మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారి నాగభూషణం రెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విక్రమ్, శానిటేషన్ సూపర్‌వైజర్లు లక్ష్మీనారాయణ, శివప్రసాద్ రెడ్డి, మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# సీఎం పర్యటనకు 1,500 మంది పోలీసులతో బందోబస్తు--

## విధుల్లో అప్రమత్తంగా ఉండాలి ఎస్పీ సునీల్ షొరాణ్--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 8:ఈ నెల 9న బనగానపల్లెలో జరిగే "మీ భూమి?మీ హక్కు" కార్యక్రమానికి హాజరుకానున్న ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో జిల్లా పోలీసు శాఖ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసింది. సుమారు 1,500 మంది పోలీసు అధికారులు, సిబ్బందిని ఎనిమిది సెక్టార్లుగా విభజించి బందోబస్తు విధులకు నియమించింది.బనగానపల్లెలోని జీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్, ఐపీఎస్ బందోబస్తు విధులపై పోలీసు సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో, అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు.హెలిప్యాడ్, సభా వేదిక, తహసీల్దార్ కార్యాలయం, వీఐపీ మార్గాలు, కార్యకర్తల సమావేశ ప్రాంగణాల్లో ప్రత్యేక భద్రత కల్పించాలని, ట్రాఫిక్ నియంత్రణతో పాటు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉన్నతాధికారుల సూచనలను కచ్చితంగా పాటిస్తూ అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా విధులు నిర్వర్తించాలని ఎస్పీ తెలిపారు.ఈ సమావేశంలో అదనపు ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# నంద్యాలలో వైఎస్సార్ కాంస్య విగ్రహ ఆవిష్కరణ--

## జగన్ నేతృత్వంలో మళ్లీ ప్రజా పాలన వస్తుందని శిల్పా రవి ధీమా--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 08-నంద్యాల శ్రీనివాస సెంటర్‌లో దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి కాంస్య విగ్రహాన్ని బుధవారం ఘనంగా ఆవిష్కరించారు. మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి, మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ నాయకులు పాల్గొని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి నివాసం నుంచి భారీ ర్యాలీగా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు శ్రీనివాస సెంటర్‌కు చేరుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా కాటసాని రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ, వైఎస్సార్‌పై ప్రజల్లో ఉన్న అపారమైన అభిమానానికి ఈ జనసంద్రం నిదర్శనమని అన్నారు. వైఎస్సార్ అమలు చేసిన సంక్షేమ పాలనను ప్రజలు ఇప్పటికీ గుర్తుంచుకున్నారని పేర్కొన్నారు.మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి మాట్లాడుతూ, విగ్రహాలను తొలగించగలిగినా ప్రజల గుండెల్లో ఉన్న రాజన్నను ఎవరూ చెరపలేరని



అన్నారు. గతంలో ధ్వంసమైన విగ్రహం స్థానంలో కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. రానున్న రోజుల్లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని, వచ్చే ఎన్నికల్లో నంద్యాల నుంచి విజయప్రస్థానం ప్రారంభించి జిల్లాలోని అన్ని స్థానాల్లో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పరమాన్ దొడ్డి సమీపంలో డంప్ యార్డు ను పరిశీలించిన పొల్యూషన్ కంట్రోల్ అధికారులు...

## - డంప్ యార్డు కు వ్యతిరేకంగా హైకోర్టు లో పిటిషన్...

## -హైకోర్టు ఆదేశాలు తో డంప్ యార్డు పరిశీలన..

## - డంప్ యార్డు ను మార్చాలని కోరిన పరమాన్ దొడ్డి గ్రామస్థులు...



విభారే న్యూస్ జూలై 08 ఎమ్మిగనూరు..ఎమ్మిగనూరు పట్టణం కు సంబంధించిన చెత్త చెదారం ను సేకరించి సోగనూరు గ్రామ సమీపం లో ఎర్పాటు చేసిన డంప్ యార్డు ను ఎమ్మిగనూరు మండలం పరమాన్ దొడ్డి గ్రామ సమీపం లో ఎర్పాటు చేయడానికి వ్యతిరేకిస్తూ పరమాన్ దొడ్డి గ్రామస్థులు హైకోర్టు లో పిటిషన్ వేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు జిల్లా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు వెంకట సాయి కిషోర్, రామకృష్ణ బుధవారం పరమాన్ దొడ్డి, రాగిమాన్ దొడ్డి గ్రామాల మధ్య ఎర్పాటు చేయనున్న డంప్ యార్డు ను వారు పరిశీలించారు. సమాచారం తెలుసుకున్న ఆయా గ్రామాల ప్రజలు పరిశీలనకు వచ్చిన అధికారులకు తమ అభ్యంతరాలను వ్యక్తం చేశారు. మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి ఇచ్చిన సమాచారం పూర్తిగా నిరాధారం. డంప్ యార్డు నుండి పరమాన్ దొడ్డి గ్రామం 2 కిలో మీటర్లు దూరం ఉన్నట్లు కలెక్టర్ కు తప్పుడు సమాచారం ఇచ్చారు. కాని ఇది కేవలం అర కిలో మీటర్ ఉన్నట్లు అధికారులకు తెలిపారు. అవసరమైతే కొలతలు వేసి దారాన్ని నిర్ధారణ చేయాలని కోరారు. అలాగే ఇక్కడ జరుగుతున్న పనులను నిలిపివేయాలని కోరారు. ఇందుకు స్పందించిన పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు ఇక్కడి ఉన్న వాస్తవాలను ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామన్నారు. ఈసందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ మా మనోభావాలు, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా దౌర్జన్యం గా పనులు చేస్తున్నారు. ఇందుకు సంబందిత అధికారులు కోర్టు ధిక్కార కేసులు ఎదురుకోనక తప్పవని హెచ్చరించారు .గ్రామస్తులు ఉప సర్పంచ్ రంగన్న యాదవ్ బోయ హనుమప్ప గజ్జల దుబ్బన్న బోయ శంకర్ ఆటో రామాంజనేయులు తెలుగు రామాంజనేయులు చాకలి గోవిందు చాకలి వెంకటేశులుగొల్ల నాగప్పళ బోయ ఈరన్న బోయ ఊరుకుంద గ్రామస్తులు..జి నల్లారెడ్డి యాదవ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రాయలసీమ విద్యార్థి పోరాట సమితి ఆర్వీపిఎస్..

# జిల్లా హామీలు నెరవేర్చాలి--

## సీపీఐ నాయకుల డిమాండ్-

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 09- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటన సందర్భంగా నంద్యాల జిల్లా అభివృద్ధి హామీలపై స్పష్టమైన ప్రకటన చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులు, ప్రజా సమస్యల పరిష్కారంలో పురోగతి కనిపించడం లేదని విమర్శించారు.అలగనూరు రిజర్వాయర్, నంద్యాలలో సీడ్ హబ్, ప్యాపిలిలో టమోటా జ్యూస్ ఫ్యాక్టరీ, దద్దనాల చెరువుకు ఎస్సార్బీసీ ద్వారా కృష్ణా జలాలు అందించే హామీల అమలుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. టమోటా



రైతులకు నిల్వ, ప్రాసెసింగ్ సదుపాయాలు కల్పించాలని, సాగునీటి ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయాలని అన్నారు.శ్రీశైలం ముంపు నిర్వాసితుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, నిరుపేదలకు ఇళ్ల స్థలాల హామీ అమలు చేయాలని కోరారు. జిల్లా అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని, లేకపోతే ప్రజలు, రైతులతో కలిసి సీపీఐ ఆధ్వర్యంలో ఉద్యమం చేపడతామని రంగనాయుడు హెచ్చరించారు.

# డెంగ్యూపై అవగాహన ర్యాలీ--

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో డా. వెంకటరమణ సూచన--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 8:జాతీయ డెంగ్యూ మాసోత్సవాల సందర్భంగా నంద్యాల పట్టణంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన ర్యాలీ, సదస్సు నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం నుంచి డీఎంహెచ్‌వో డా. వెంకటరమణ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొని "చెక్?క్లీన్?కవర్" నినాదాలతో దోమల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు.అనంతరం ఆర్ఆర్ నర్సింగ్ కళాశాలలో నిర్వహించిన సదస్సులో జిల్లా మలేరియా అధికారి సి. చంద్రశేఖర్ రావు మాట్లాడుతూ, డెంగ్యూ ఏడిస్ దోమ కాటు ద్వారా వ్యాపిస్తుందని, జ్వరం, తలనొప్పి, కీళ్ల నొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించి ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని, దోమల నివారణ చర్యలు తప్పనిసరిగా చేపట్టాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# ఎస్ఐఆర్‌పై ఏసీపీ తనిఖీ--

## 26, 27వ వార్డుల్లో క్షేత్రస్థాయిలో పరిశీలన--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 08-నంద్యాల పట్టణంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం పురోగతిని ఎస్ఐఆర్ నోడల్ అధికారి, ఏసీపీ నరసింహమూర్తి బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ముందుగా 27వ వార్డు సచివాలయాన్ని సందర్శించి ఎస్ఐఆర్ కార్యక్రమం అమలు తీరును పరిశీలించారు. అనంతరం 26వ వార్డు దేవనగర్‌లో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని తనిఖీ చేసి, ఇంటింటి సర్వే, ఓటరు వివరాల నమోదు, దరఖాస్తుల స్వీకరణ, రికార్డుల నిర్వహణను పరిశీలించారు.ఎస్ఐఆర్



కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా పారదర్శకంగా నిర్వహించాలని, ప్రతి ఇంటిని సందర్శించి ఓటరు వివరాలను కచ్చితంగా నమోదు చేయాలని సంబంధిత సిబ్బందికి ఏసీపీ నరసింహమూర్తి సూచించారు. నిర్ణీత గడువులో కార్యక్రమాన్ని పూర్తి చేసి, ఓటరు జాబితా సవరణలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190